

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

## వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచే స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

### మేఘేధాకతార

**భాష:** బెంగాలీ, **కథ:** శక్తిపదరాజగురు, **సంగీతం:** జ్యోతీంద్రమైత్ర, **దర్శకత్వం:** రిత్విక్‌ఘటక్
**నటీనటులు:** సుప్రియాచౌదరి(నీతా), అనిల్‌చటర్జీ(శంకర్) బిజోన్(తండ్రి), గీతాఘటక్(గీత), గీతాదాస్(తల్లి) **విడుదల:**1960




**భారతీయ** సినిమా రంగంలో రిత్విక్ ఘటక్ ఓ హై ఓల్టేజ్ టాలెంట్. ఆయన నిర్మించిన చిత్రాల్లో ఎంచుకున్న సబ్జెక్టు కానీ, నిర్మాణ రంగంలో ఆయన చిత్రీకరణ పద్ధతి, సంగీతాన్ని దృశ్యాల్ని లయాకరించిన విధానమూ ఆయన స్థాయిని చెబుతాయి. భారతదేశ విభజనపట్ల ఆయన దుఃఖపడడమూ, కళాత్మకంగా స్పందించిన తీరూ ఆయనలోని సున్నితత్వాన్ని, నిజాయితీని స్పష్టపరుస్తాయి. నవ్య వాస్తవిక వాదిగా ఆయన చిత్రాల్లో అత్యంత వేదనాభరితమయిన బతుకుల్ని వెళ్ళదీస్తున్నవారే ప్రధాన పాత్రలుగా నిలుస్తారు. భారతీయ నవ్య సినిమా రంగంలో గ్రేట్ మాస్టర్స్‌గా చెప్పుకునే ముగ్గురిలో (సత్యజిత్ రే, మృణాల్ సేన్) రిత్విక్ ఘటక్ కూడా ఒకరు.

ఆయన నిర్మించిన చిత్రాల్లో ఒక్కొక్కటి ఓ దృశ్యకావ్యం. కాని "మేఘేధాకతార"ను ఆయన తన చిత్రాల్లోకెల్లా గొప్ప చిత్రమని ఆయన పేర్కొన్నారు. ఇందులో స్వార్థాన్ని త్యజించి, తనకుటుంబంలోని వారి అవసరాలు నెరవేర్చడం కోసం కొవ్వొత్తిలా కరిగిపోయిన

నీత ముఖ్యాభినేత్రి. ఈ చిత్రంలో స్త్రీత్వాన్ని, త్యాగాన్ని ప్రధానాంశాలుగా చేసుకుని మధ్య తరగతి జీవుల మనస్థత్వాల్ని స్వార్థాల్ని విశ్లేషిస్తాడు రిత్విక్ ఘటక్.

నిజానికి రిత్విక్ సమాజంలో కిందస్థాయి ప్రజల్లోని ఆలోచనల్లోనూ, ఆచరణల్లోనూ ఉన్న సాంస్కృతిక పరమయిన అంశాల్ని తీసుకుని విశ్వజనీనమయిన మార్క్సిస్టు సంస్కృతిలోకి అన్వయించి విశ్లేషిస్తాడు. అందులో భాగంగానే బెంగాలీ ప్రజానీకంలో ఉన్న గౌరీదాన్ అన్న ఆచారాన్ని మౌలికాంశంగా తీసుకుని ఈ చిత్రం రూపొందించారు ఘటక్. ఈ చిత్రానికి మౌలికమయిన కథకు ఓ చిన్న కథ ఆధారం. బెంగాల్‌లో అత్యధికమయిన ప్రజాదరణ కలిగిన ఒక పత్రికలో వచ్చిన ఆ కథను ఆధారం చేసుకుని రూపొందించారు. ఆ కథలోని ప్రధాన ఇతివృత్తానికి ఘటక్ తన ఆలోచనల్ని, అభిప్రాయాల్ని జోడించి కథా కథనాన్ని రూపొందించుకున్నారు.

బెంగాల్‌లో గౌరీదాన్ ఆచారం ప్రకారం గౌరీకి పెళ్ళిచేసి పంపించడం ప్రధానాంశం. గౌరీ శివుల పెళ్ళి జానపద గీతాల లయతో గొప్పగా చేస్తారు. అయితే శివుడు సుదూరంగా ఉన్న పర్వత శ్రేణువుల్లో నివసిస్తూ ఉంటాడు. 'మేఘేధాక తార'లో చివర్లో నీత తీవ్రమయిన అనారోగ్యంతో పర్వత సానువుల్లోని ఆసుపత్రికి చేరుతుంది. అంతేకాదు చిత్రంలో జగత్ ధతీ ఉత్సవంలో మహిళంతా లయ బద్ధంగా పాడే 'ఉమా రావమ్మా' పాట గౌరీదానాన్నే స్ఫురింపచేస్తుంది. ఇలా సూచనాత్మకంగా సాగే చిత్రీకరణ రీతిలో ఘటక్ తన ప్రతిభను చూపిస్తాడు. ఇంకా స్త్రీలల్లో కనిపించే మూడు రూపాల్ని 'మేఘేధాకతార'లో భిన్నమయిన మూడు పాత్రల్లో స్పష్టంగా చిత్రిస్తాడు. పెద్దకూతురు నీతా పాత్రలో స్వాధ్వీ, లక్షణాన్ని దయామయ గుణాన్ని వివరిస్తే. ఆమె సోదరి గీత పాత్రలో అందమూ, శృంగారయుతమూ లక్షణాల్ని ప్రోదిచేస్తాడు. ఇక తల్లి పాత్రలో స్వార్థమూ, క్రూరత్వమూ కనిపిస్తాయి. ఇలా స్త్రీ పాత్రల విశ్లేషణ చేస్తూనే సామాజిక లక్షణాల్ని, స్వార్థపరత్వాన్నీ తెగతిడతాడు రిత్విక్ ఘటక్. ఈ చిత్రం గురించి భారతీయ సినీ విమర్శారంగంలో విస్తృతమయిన చర్చ జరిగింది. కుమార్ సహానీ, ఆశిష్ రాజ్యాధ్యక్షలాంటి ఎంతోమంది చర్చకు ఉపక్రమించారు. మేఘేధాక తార ఓ అధ్యయన చిత్రంగా మిగిలిపోయింది.



చిత్రకథాంశం విషయానికి వస్తే భారత స్వాతంత్ర్యానంతరం 50 వ దశకం చివరి అర్ధభాగం అత్యంత సంక్షుభితమయిన కాలం. బెంగాల్ విభజన, బెంగాల్ కరువులాంటి తీవ్రమయిన విషయాల్ని చవిచూసిన బెంగాలీ సామాజిక వాతావరణ నేపథ్యంలో ఈ చిత్ర కథ కొనసాగుతుంది. వలస వచ్చిన ఓ కుటంబంలో నీతా పట్నంలో ఉద్యోగం చేస్తూ ఉంటుంది. ఆమె తనవాళ్ళకు అండగా నిలుస్తుంది. ఆర్థికంగా తనవారికి సహకరిస్తూనే కుటుంబంలో నియమనిబద్ధమయిన వాతావరణ రూపొందేందుకు యత్నిస్తుంది. అయితే వరసగా జరిగిన పలు సంఘటనలు ఆ కుటుంబాన్ని అతలాకుతలం చేస్తాయి. ఆ ఇంట్లో పెద్దకొడుకు సంగీత సాధన చేస్తూ పెద్దగాయకుడిగా ఎదగాలని కలలు కంటూ ఉంటాడు. చిన్నవాడు మోంటు ఓ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ మెషిన్ ప్రమాదంలో గాయపడతాడు. ఇక నీతా తండ్రి సాహిత్యమూ, బెంగాలీ స్వేచ్ఛావాదాల అధ్యయనంలో ఎదిగినవాడు. ఆయన కూడా ఓ ప్రమాదంలో గాయపడి ఇంట్లోనే ఉంటాడు.

నీతా చెల్లెలు గీతా అందగత్తె. శృంగారాన్ని ఒలకబోస్తూ తిరుగుతుంది. నీతా ప్రేమించిన సైంటిస్టు సనత్‌ను ఆకర్షించి గీత తనవైపు తిప్పుకుంటుంది. అతన్ని పెళ్ళాడుతుంది. ఇక నీతా తల్లి స్వార్థం తోను, క్రూరత్వంతోనూ నిండి ఉంటుంది. ఆమె అన్నింటికీ నీతాపైన ఆధారపడుతూనే గీతపట్ల, ఆమె అందం పట్ల ప్రత్యేక ప్రేమను ఒలకపోస్తూ ఉంటుంది.

అలా కాలం గడిచిపోతూ ఉండగానే శంకర్ తన సంగీతాన్ని నమ్ముకుని తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఇంట్లోంచి వెళ్ళిపోతాడు. తను పడుతున్న బాధకు తోడు నీతా ఆరోగ్యం క్షీణిస్తుంది. ఆమెకు క్షయవ్యాధి సోకుతుంది. తను చిన్ననాటి నుండి కలలు కంటున్నట్లు పర్వత శ్రేణుల్లోకి వెళ్ళాలని ఆమె తీవ్రంగా తలపోస్తుంది.

మరోవైపు ధిక్కారంతో పట్నం వెళ్ళిన శంకర్‌కి మంచి అవకాశాలు రావడంతో పేరు, డబ్బు ప్రోగవుతాయి. పెద్ద గాయకుడై ఇంటికి తిరిగి వస్తాడు. ఇంటి బాధ్యతల్ని స్వీకరిస్తూనే నీతాను షిల్లాంగ్ లోని ఆసుపత్రికి చేరుస్తాడు. ఇంట్లో గీతకి పాపపుడుతుంది. అక్కడ ఆరోగ్యం మరింత క్షీణించిన నీతా తను ఇంకా ఎంతోకాలం జీవించాలనుకుంటుంది. కాని ఆమె రోదనలు పర్వత సానువుల్లో ప్రతిధ్వనించి ఆమె క్షోభ విశ్వవ్యాపితమవుతుంది.

నీతా పాత్రని ఇరుసుగా చేసుకుని రిత్విక్ ఘటక్ రూపొందించిన 'మేఘేధాకతార' కాళీమాత భావనని ఆ ప్రాంత ప్రజల సాంస్కృతిక నేపథ్యంలోంచి విశ్వజనీనం చేస్తూ గొప్ప చిత్రంగా నిలుస్తుంది. ఆయన అన్ని చిత్రాల్లోలాగే సంగీతం ఈ చిత్రంలో గొప్ప పాత్రని పోషిస్తుంది. అయితే ఆ సంగీతం అలంకరణగానో, ప్రత్యేకమయిన అంశంగానో గోచరించదు. అది దృశ్యాలతో సంయోగం చెంది వెంటనే వేరు పర్చలేని స్థితికి చేరుకుంటుంది. జ్యోతీంద్ర మైత్రీ అందించిన సంగీతం ఆయా సందర్భాల్లో మనం కనీసం గుర్తించలేనంతగా దృశ్యాల్లో కలిసిపోతుంది. ఇక చిత్రంలో ఉపయోగించిన పాటలు బంగ్లా 'దేశీ' జానపద గీతాలు అద్యంతం ప్రేక్షకుల్ని ముందుకు నడిపిస్తాయి.

స్త్రీ కోణంలో నిర్మితమైన రిత్విక్ ఘటక్ చిత్రం 'మేఘేధాకతార' దృశ్య కావ్యం అన్నమాటలు సరిగ్గా సరిపోయే చిత్రం

✡✡✡

## ఎక్‌దిన్ ప్రతిదిన్

**భాష:** బెంగాలీ, **దర్శకత్వం:** మృణాల్ సేన్; కెమెరా-కె.కె.మహజన్, సంగీతం-బి.విరమాకారంత్

**నటీనటులు:** గీతాసేన్, మమతా, శంకర్, శ్రీలా,మజుందార్.

**విడుదల:** 1979




"సినిమా గారడీ చేయడానికో, చమత్కారం చేయడానికో నిర్దేశించబడలేదు. నిజానికి సినిమా కొత్త ఆలోచనలు ఆవిష్కృతం కావడానికి, సరికొత్త భావాలు పెల్లుబుకడానికి కళాత్మకమైన సంతోషం కలిగించడానికి ఉద్దేశించబడింది" అంటారు మృణాల్ సేన్. భారతీయ నవ్య చలన చిత్ర చరిత్రలో గొప్ప ప్రావీణ్యత కలిగిన మొదటి తరానికి చెందినవాడు మృణాల్ సేన్. ఆయన నిర్మించిన కలకత్తా ట్రయాలజీ నుంచి మొదలు ఒక స్పష్టమైన లక్ష్యంతో రాజకీయ దృక్పథంతో చిత్రాలు నిర్మించారు "సామాజిక చలన చిత్ర శిల్పిగా" బహుముఖ ప్రశంసలు అందుకున్న సేన్ తన చలన చిత్ర రేఖా పటంలో బహువిస్తృతమైన అంశాల్ని తీసుకుని సినిమాలు నిర్మించారు. మొదటి పదేళ్ళలో (1956-66) ఆయన చిత్రాలు వివరణాత్మకంగా ఉండి కథాత్మాంగా సాగాయి. తర్వాత 1966-80లదాకా ఆయన చిత్రాల్లో ఫ్రెంచ్ మాస్టర్స్ ప్రభావం మనకు విశేషంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆయన 1970 ప్రాంతంలో నిర్మించిన కలకత్తా ట్రయాలజీ గొప్ప భావుకతతో అవగాహనతో చేసిన రాజకీయ ప్రకటనలుగా నిలిచాయి. ఇక 'భువన షోమ్' ఆయనలోని కళాత్మతకి అత్యున్నత శిఖర రూపం. 1980ల తర్వాత సేన్ చిత్రాలు అంతర్ముఖత్వాన్ని అందిపుచ్చుకున్నాయనే చెప్పుకోచచ్చు. దాదాపు అర్ధశతాబ్దంగా విస్తరించి ఉన్న మృణాల్‌సేన్

సినిమా ఒరవడిలో మధ్య తరగతి ప్రజల జీవన ఇతివృత్తంతో నిర్మించిన చిత్రాలూ ఉన్నాయి. వాటిల్లో 'స్త్రీ'ని, మధ్య తరగతి సమాజాల్లో స్త్రీ ప్రట్ల ఉండే భావనని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని నిర్మించిన చిత్రం 'ఎక్‌దిన్ ప్రతిదిన్'.



"ఇక్కడ మనం ఏ టైంకి ఎక్కడుండాలో మన ప్రమేయం లేకుండానే ఈ సమాజమే నిర్ణయిస్తుంది. అందుకు భిన్నంగా మన కిష్టమైన సమయానికి మన కిష్టమయిన చోటికెళ్ళామో లేదా కనీసం రొటీన్‌కి భిన్నంగా కనిపించామో సవాలక్ష ప్రశ్నలకి సమాధానాలు చెప్పాల్సి వస్తుంది. ఖర్మ మన ఉద్యోగం మనం చేసుకుంటూ మన బతుకు మనం బతుకుతున్నా సరే, ఈ సమాజం నీడ మన వెన్నంటే ఉంటుంది మరి" అంటారు ఓ మిత్రురాలు నాతో. ఎంత గొప్ప విశ్లేషణ. సరిగ్గా ఇలాంటి ఒక పాయింట్‌నే తీసుకుని మృణాల్‌సేన్ 1979 లో బెంగాల్ లో 'ఎక్‌దిన్ ప్రతిదిన్' సినిమా నిర్మించారు. ఒక కిందిస్థాయి మధ్య తరగతి కుటుంబంలో ఉద్యోగం చేసే యువతి ఆఫీసునుంచి సాయంత్రం రోజూ వచ్చే వేళకి ఇంటికి రాకపోవడంతో ఆ కుటుంబంలో, దాని చుట్టూ పరుచుకుని ఉన్న మధ్య తరగతి కుటుంబాల్లోనూ చెలరేగిన ఊహల తుపాను ఈ చిత్రం. ఒక బిందుమాత్రమయిన అంశాన్ని తీసుకుని సామాజిక విశ్లేషణకి పూనుకుని స్త్రీ విషయంలో మధ్య తరగతి మనుషులో ఉండే ఖాళీల్ని అనుమానపు ఎత్తుపల్లాల్ని అత్యంత ప్రతిభావంతంగా ఈ చిత్రంలో వివరించారు సేన్. చలన చిత్ర నిర్మాణపరంగా మృణాల్ సేన్ స్థాయికి లేదనే విమర్శల్ని ఈ చిత్రం ఎదుర్కొన్నప్పటికీ స్త్రీ కోణంలోంచి సమాజాన్ని ఆవిష్కరించిన గొప్ప చిత్రంగా ఇది నిలిచిపోతుంది.

సువిశాలమైన కలకత్తా నగరంలో అతి పురాతన కట్టడం ఓ మధ్య తరగతి ఇలాఖా. అందులోని పదహారు గదులూ పోర్షన్లుగా విభజింపబడి మామూలు కుటుంబాలు కిరాయికి ఉంటాయి. అన్ని పోర్షన్లకీ ఒకే ముఖద్వారం, ఒకే పెరడు భాగం. దాంతో వారికి చెప్పుకోతగ్గ ఏకాంతాలూ రహస్యాలూ లేవు. అలాంటి వాతావరణంలో సేన్ గుప్తాది ఓ కుటుంబం. సేన్ గుప్తా ఉద్యోగంలోంచి రిటైర్ అయి తనకు వచ్చే అతి స్వల్ప పెన్షన్‌తో కుటుంబాన్ని ఈదలేని స్థితిలో ఉంటాడు. ఆయన పెద్ద కూతురు చిన్నూ ఉద్యోగం చేస్తూ ఆ కుటుంబానికి పెద్ద అండగా నిలుస్తుంది. ఆమె ఆదాయమే వారి జీవనోపాధికి ఆధారమవుతుంది. ఆ స్థితిలో ఒక రోజు సాయంత్రం చిన్నూ ఎప్పటిలాగా సాయంత్రం ఇల్లు చేరదు. రోజూ వచ్చే సమయానికి ఆమె రాకపోవడంతో కాలం గడుస్తున్న కొద్దీ అందరిలో ఆదుర్దా పెరిగిపోతుంది. సేన్‌గుప్తా కుటుంబంతోపాటు ఆ భవంతిలో ఉన్న అన్ని కుటుంబాల్లోనూ చిన్నూ ఇల్లు చేరకపోవడం పెద్ద చర్చనీయాంశం అవుతుంది.

అసలేం జరిగి ఉంటుంది? రోజూ సరిగ్గా వచ్చే చిన్నూ రాలేదంటే ఏదో జరిగే ఉంటుంది. ఏదీ లేకుండా ఎందుకు రాదు? ఏదైనా ప్రేమ వ్యవహారమేమో? లేదా కుటుంబాన్ని వదిలేసి లేచిపోయిందేమో? లేదా ఏదైనా ఆక్సిడెంట్‌కి గురైందో...? ఇలా ఎన్నో జవాబులేని ప్రశ్నలు, భిన్నమయిన అభిప్రాయాలు పుంఖానుపుంఖాలుగా ఆ భవంతిలోని మనుషుల్లో ఉద్భవిస్తాయి. కొందరు బయటికే అంటూ చర్చించడం మొదలుపెడతారు.

చిన్నూ కోసం పోలీస్ స్టేషన్‌కీ, ఆసుపత్రికీ పరుగులు పెడతారు. ఎక్కడా ఆమె కనిపించదు. సమయం గడుస్తున్నకొద్దీ చిన్నూ గురించి చెడు భావాలతో కూడిన వాదాలు తీవ్రతరం అవుతూ ఉంటాయి. సేన్ గుప్తా కుటుంబంలోని వారు ప్రార్థనలు చేయడం మొదలుపెడతారు.

సేన్ గుప్తా కుటుంబంలో చిన్నూ తర్వాతి వాడు విద్యావంతుడయిన నిరుద్యోగి, ఆమె చెల్లెలు మిను కాలేజీలో చదువుతూ ఉంటుంది. చీకటిపడుతూ ఉన్న కొద్దీ మినులో అసహనం పెరిగి ఇంట్లో అంతా అక్క జీతంపై ఆధారపడి పరాన్నభుక్కులుగా మారిపోయారని నిందిస్తుంది. ఇక తను చదువు మానేసి ఉద్యోగం చేయాలేమోనంటూ ఆవేశపడుతుంది. మొదట్లో చిన్నూ ప్రేమ వ్యవహారాన్ని ఖండించి తుంచివేశారని తల్లి నిందిస్తుంది. ఇక తల్లేమో జీవితాంతం కుటుంబ వ్యవహారాల పట్ల ఉదాసీనంగా ఉండి బాధ్యతనంతా తనపై వేశారని భర్త సేన్ గుప్తాపై విరుచుకు పడుతుంది. చుట్టూ ఉన్న ఇళ్ళల్లోని వారు ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుకుంటూ ఉంటారు.

ఈ గందరగోళ స్థితిలో చిన్నూ ఇల్లు చేరుతుంది. అంతా ఒక్కసారిగా గంభీరమయిపోతుంది. తనవాళ్ళే తనపైన అవిశ్వాసం వ్యక్తం చేసిన విషయం అవగతమై ఆమె తీవ్రంగా వ్యాకులపడుతుంది. బయట చిన్నూ తమ్ముడు ఇంటి ఓనరుతో తీవ్రంగా గొడవపడతాడు. ఆయన చిన్నూ గురించి చేసిన కామెంట్లకి ప్రతిగా ఎదురుతిరుగుతాడు.

రాత్రి గడిచిపోతూ ఉంటే అంతా సద్దుమణుగుతుంది. తెల్లారి యధావిధిగా అందరి దిన చర్యలూ మొదలవుతాయి. ఇవి ప్రధానంగా చిత్రంలో కనిపించే అంశాలు. చాలా సున్నితమైన పాయింట్‌ని తీసుకుని 95 నిమిషాల చిత్రాన్ని నిర్మించడంలో సేన్ చూపించిన ప్రతిభ అద్భుతమయింది. కథ కంటే కథనం సాగిన సాగిన తీరు, మనుషులు వారి మనస్తత్వాలు బయటపడ్డ తీరు, మనుషుల్లో ఉండే వెలితి తనం కుహనా విలువపట్ల వారి నిబద్దత ఇందులో కనిపిస్తుంది. మొత్తంగా స్త్రీపట్ల, ఆమె గృహిణి అయినా ఉద్యోగస్తురాలయినా ఆమెను నియంత్రించే, ఆమె చుట్టూరా ఈ సమాజం నిర్మించే పారదర్శక గోడల్ని ఈ చిత్రం చర్చకు పెడుతుంది.

గంభీరమైన విషయాన్ని సున్నితంగా సృష్టించిన సేన్ విజయం సాధించారు.

✡✡✡